ప్రజాశక్తి

శనివారం 13 డిసెంబర్ 2025

శ్రీ సత్యసాయి

దీపికకు చెక్కు అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

దీపిక చొరవ.. తంబళ్లహట్టి రహదారికి మోక్షం..!

ప్రజాశక్తి - మడకశిరటౌన్

మండల పరిధిలోని తంబళ్ళహట్టి గ్రామానికి రహదారికి ఇండియన్ అంధుల క్రికెట్ కెప్టన్ విన్నపంతో మోక్షం కలిగింది. గ్రామానికి రహదారి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్తులు ఎన్నోసార్లు పలువురు నేతలను, ప్రభుత్వాలను కోరినా ఫలితం కన్పించలేదు. ఇదే గ్రామంలో జన్మించిన దీపిక కర్నాటక ప్రాంతంలో చదివి అక్కడే క్రికెట్ బ్యాట్ పట్టి భారత దేశ అందుల క్రికెట్ కెప్టెన్ అయింది. అందుల తొలి ప్రపంచ క్రికెట్ కప్‌ను సాధించింది. దీంతో ప్రతి ఒక్కరూ తంబళ్ళహట్టి గ్రామం వైపు చూస్తున్నారు ఈ నేపథ్యంలోనే దీపిక ఎమ్మెల్యే నుండి ముఖ్యమంత్రి ప్రధాని రాష్ట్రపతి లచే ప్రశంసలందుకుంది. తాజాగా డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కళ్యాణ్ అమరావతిలో అంధుల క్రికెట్ టీంకు సన్మానించారు. జట్టు సభ్యులకు చెక్కులను అ ందజేశారు. ఈ సందర్భంగా దీపిక తమ గ్రామానికి రోడ్డు వేయించాలని ఉపముఖ్యమంత్రిని కోరింది. స్పందించిన ఆయన గ్రామానికి రోడ్డు వేయిస్తానని ప్రకటించారు. ఏది ఏమైనా దీపిక సాధించిన విజయంతోనే ఆ గ్రామానికి రహదారి నిర్మాణం జరుగుతుందన్న ఆనందం ఆ గ్రామస్తుల్లో ప్రస్తుతం కనిపిస్తోంది. దీపిక సాధించిన విజయం తనొక్కరికే పరిమితం కాకుండా దేశానికే ఎంతో ఆదర్శంగా నిలిచిందని వారు పేర్కొంటున్నారు. ఆ గ్రామానికి సైతం ఉన్న ప్రధానమైన రోడ్డు సమస్యను డిప్యూటీ స్పీకర్ సమక్షంలో వ్యక్తపరిచి సాధించుకోవడంతో ఆ గ్రామానికి రోడ్డు సాధించి పెట్టిన దీపికను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

పనితీరు మారకపోతే చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర టౌన్

ఒకటికి రెండు మార్లు చెప్పినా అధికారులు తమ పనితీరు మార్చుకోకపోతే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు హెచ్చరించారు శుక్రవారం మడకశిర పట్టణంలో ని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు, బిసి వెల్ఫేర్, ఎస్.సి వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్లతో సమీక్షా సమావేశాన్ని ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న కొన్ని గురుకుల, కస్తూరిబాయ్, హాస్టళ్లను సందర్శించి లోపాలను గుర్తించామని ఈ విషయంలో తాము సూచించినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అని ప్రశ్నించారు. విద్యార్థుల పట్ల అజాగ్రత్తగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు కొత్తచెరువు విద్యార్థి

ప్రజాశక్తి - కొత్తచెరువు

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎన్ నవదీప్ జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. కడప జిల్లా పులివెందుల టర్ఫ్ ఫీల్డ్‌లో ఈ నెల 9 నుంచి 11 వరకు రాష్ట్రస్థాయి ఎస్‌జిఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపర్చిన నవదీప్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థినిపాఠశాల హెచ్ఎం గోపాల్, పీటీ వెంకటేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సిరసనోరు

- ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా
- కలెక్టరేట్‌కు వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు
- జిల్లా నలమూలల నుంచి తరలొచ్చిన అంగన్‌వాడీలు
- ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్
- మాట తప్పితే ఉద్యమం తప్పదంటూ హెచ్చరిక

న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు ఉద్యమబాట పట్టారు. ఎన్నికల హామీలు అమలు చేయాలంటూ ఆందోళనకు దిగారు. ప్రభుత్వం మొద్దునిద్రను వీడి సమస్యలను పరిష్కరించాలంటూ నినదించారు. శుక్రవారం నాడు సిఐటియు ఆధ్వర్యంలో పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. జిల్లా నలమూల నుంచి తరలొచ్చిన వేలాది మంది అంగన్‌వాడీ కార్మికులు, మినీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తే ఉద్యమం తప్పదంటూ వారు హెచ్చరించారు.

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నిరసనలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వందలాది మంది అంగన్వాడీ కార్యకర్తలు పుట్టపర్తి గణేష్ కూడలికి చేరుకున్నారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు ప్రదర్శనగా బయల్దేరారు. పోలీసులు వారిని గణేష్ కూడలి వద్ద అడ్డుకున్నారు. కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లడానికి అనుమతులు లేవని, ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చౌక్ వద్ద నిరసన తెలపాలని సూచించారు. ఈ సమయంలో కొంతసేపు పోలీసులు, సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం పోలీసుల సూచన మేరకు గణేష్ కూడలి నుంచి అంగన్వాడీ కార్యకర్తలు భారీ ప్రదర్శనతో ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కనీస వేతనం వెంటనే చెల్లించాలని, హామీలు అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. దాదాపు మూడు మూడు గంటల పాటు ఆర్డీవో కార్యాలయం వద్ద బైఠాయించి ధర్నాను కొనసాగించారు.

హామీలు అమలు చేయకుంటే ఉద్యమం

గతేడాది సమ్మె సందర్భంగా ప్రతిపక్షంలో ఉన్న కూటమి నేతలు అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రత్యక్ష ఉద్యమం తప్పదంటూ సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నాయకులు తెలియజేశారు. అంగన్వాడీల ఆందోళనను ఉద్దేశించి సిఐటియు నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్వాడీలు అనేక రకాల సేవలు అందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలను ప్రజలకు చేర్చడంలో అంగన్వాడీల పాత్ర కీలకంగా ఉందన్నారు. ఇన్ని పనులు చేస్తున్న వీరిని ప్రభుత్వాలు గుర్తించకపోవడం విచారకరం అన్నారు. 2019 నుంచి అంగన్వాడీలకు ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేదన్నారు. వేతనాలు పెంపు, ఇతర సమస్యలపై 2023, డిసెంబర్ నెలలో 42 రోజులు పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించామన్నారు. సమ్మె చేస్తున్న సమయంలో తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా హామీలు అమలుకు నోచలేదన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీల వేతనాలు పెంచాలన్నారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలనూ వీరికి వర్తింపజేయాలని కోరారు. రాజకీయ వేధింపులు, అధికారుల ఒత్తిళ్లను నియంత్రించాలన్నారు. యాప్‌ల పేరుతో వేధింపులను నియంత్రించాలన్నారు. అర్హులందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించకుంటే అంగన్‌వాడీలకు మద్దతుగా సిఐటియు ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధం అవుతామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్ కుమార్, శ్రామిక మహిళ సంఘం నాయకురాలు దిల్షాద్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. లబ్ధిదారులకు ఇచ్చే పౌష్టికాహారం నాణ్యతను పెంచాలన్నారు. మెనూ ఛార్జీలను పెంచి, ఉచిత గ్యాస్ ఇవ్వాలన్నారు. అనంతరం యూనియన్ నాయకులు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవో సువర్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, పైపల్లి గంగాధర్, అంకే ముత్యాలు, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీదేవి, జిల్లా కార్యదర్శి జిఎన్.శ్రీదేవి, చంద్రకళ, రంగమ్మ, బీబీజాన్, సుజాతమ్మ పాల్గొన్నారు.

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

స్వామిత్వ రీసర్వేను వేగవంతం చేయాలి : జేసీ

సమావేశంలో జేసీ, అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా పరిధిలో గ్రామాల స్థాయిలో జరుగుతున్న స్వామిత్వ రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేసి, గ్రామంలోని ప్రతి ఇంటికి యజమాన్య హక్కుల కార్డు అందివ్వాలని జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం జరిగింది. జిల్లాలోని 153 గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్వ రీసర్వే పురోగతి, ఎదురైన సమస్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ సర్వే గ్రామకంఠ స్థాయిలో ప్రజలకు శాశ్వత యజమాన్య హక్కులు కల్పించే కీలక కార్యక్రమమని, అందులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదని అన్నారు. కదిరి, పుట్టపర్తి డివిజన్లలో సర్వే ప్రక్రియ వేగాన్ని మరింత పెంచాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, విలేజ్ సర్వేయర్లు సమన్వయంతో పకడ్బందీగా పనిచేయాలని, అవసరమైతే అదనపు విలేజ్ సర్వేయర్లను కూడా నియమించుకోవచ్చని తెలిపారు. ఇకపై వారానికి ఒకసారి డివిజనల్ స్థాయిలో, ప్రతి రోజూ మండల స్థాయిలో సర్వే పురోగతిని అధికారులు సమీక్షించాలన్నారు. సమీక్షా సమావేశానికి ముందు జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, జిల్లా పంచాయతీ అధికారి వై. సమత కలిసి కొత్తచెరువు మండలంలోని కే. నాగిరెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న స్వామిత్వ రీసర్వే పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, పెనుగొండ, కదిరి ఆర్డీవోలు సువర్ణ, ఆనందకుమార్, వీవీఎస్ శర్మ, డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులు అన్ని రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సమాజంలో సకలాంగులతో పాటు వికలాంగులు అన్ని రంగాల్లో రాణిస్తూ అత్యంత ప్రతిభ కనబరుస్తున్నారని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కొనియాడారు. పుట్టపర్తి సాయి అరామం లో శుక్రవారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభవంతుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడి అర్చన ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ , మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ,దివ్యాంగుల సంక్షేమ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గుడివాడ నారాయణస్వామితో కలసి పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతిభలో దివ్యాంగులు సకలాంగులకు దీటుగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. వికలత్వం శరీరానికి మాత్రమే కానీ మేధస్సుకు కాదన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతులు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన క్రీడల్లో రాణించి ఖ్యాతి సంపాదిస్తున్నారని అందుకు ఉదాహరణ ఈ మధ్య అంధుల మహిళల క్రికెట్ ఛాంపియన్ గా భారత్ జట్టు నిలిచిందని ఆ జట్టుకు నాయకత్వం వహించిన మన ప్రాంతానికి చెందిన దీపికానే ఉదాహరణ అన్నారు. అదేవిధంగా భౌతిక శాస్త్రంలో స్టీఫెన్ విలియం ఫకింగ్, సుధా చంద్రన్ ,శేఖర్ నాయక్,టీ సీ దీపికా లాంటి ఎంతో మంది శాస్త్రవేత్తలుగా క్రీడాకారులుగా సినీ గాయకులుగా నాట్య కళాకారులుగా వివిధ రంగాల్లో రాణించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మొట్ట మొదటి సారిగా పింఛన్లు రెట్టింపు చేసి దివ్యాంగులకు ఆర్థికంగా చేయూత నిచ్చి అండగా నిలిచారని పేర్కొన్నారు. దేశంలో అత్యధిక పించన్ అందజేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని వర్గాల సంక్షేమ అభివృద్ధికి కషి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏ వర్గానికి న్యాయం జరగలేదని విమర్శించారు. అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రజలు గుర్తుపెట్టుకోవాలని ఎమ్మెల్యే కోరారు. సంకల్పం ఉంటే సకలాంగులకు ఢీటుగా దివ్యాంగులు ఏదైనా సాధించవచ్చని కొన్ని రంగాల్లో నిరూపిస్తున్నారని పేర్కొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ సకలాంగుల కంటే దివ్యాంగులు అత్యంత ప్రతిభావంతులని కొనియాడారు. అంతేకాకుండా మహిళలకు ఇచ్చిన విధంగానే దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి పెద్దపీటవేశారని గుర్తు చేశారు. వికలాంగులకు జిల్లా కేంద్రంలో వికలాంగుల భవన్ ఏర్పాటు చేయాలని వారు కోరిక మేరకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అంతకుముందు వికలత్వం కలిగిన కళాకారులు ప్రదర్శించిన నాట్యాన్ని తిలకించారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తూ అత్యంత ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, నారాయణస్వామి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, డి ఆర్ డి ఏ వెలుగు పిడి నరసయ్య ,దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు డీఎస్టీఓ కిషోర్ ,రాష్ట్ర వడ్డెర డైరెక్టర్ పలిపి శ్రీనివాసులు, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ,వివిధ విభిన్న ప్రతిభావంతుల సంఘాల నాయకులు , కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

'గొర్రెల పెంపకం దారుల' సంఘం ఎన్నికలు వాయిదా

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న గణపయ్య స్వామి ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం పాలకవర్గం ఎన్నికలు రెండవసారి వాయిదా పడ్డాయి. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన ఈ ఎన్నికలు కొంతమంది సభ్యుల నిర్వాకంతో వాయిదా పడ్డ విషయం తెలిసిందే. తిరిగిఈ ఎన్నికలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టి శుక్రవారం నిర్వహించేందుకు సన్నాహాలు చేసింది. ఈసారి కూడా గత పాలక వర్గం నిర్వాకంతో రెండవసారి ఎన్నిక వాయిదా వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల అధికారి డి.మౌలాలి భాష ఉదయం 10 గంటలకే ఆత్మకూరు గ్రామానికి చేరుకొని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ సంఘంలో మొత్తం 73 మంది సభ్యులు ఉండగా ఎన్నిక నిర్వహణ కోసం మెజార్టీ సభ్యులు హాజరయ్యారు. ఎన్నిక నిర్వహించాలంటే గత పాలకవర్గం వద్ద ఉన్న అడ్మిషన్ల రిజిస్టర్, మినిట్స్ రిజిస్టర్ ఎన్నికల అధికారికి సమర్పించాలి. కానీ గత పాలకవర్గం నిర్లక్ష్యంతో ఈ రెండు రకాల రికార్డులనుఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయకపోవడంతో పాటు ఎన్నికలకు హాజరు కాకపోవడంతో అధికారులు ఎన్నికను నిరవధికంగా వాయిదా వేశారు. ఎన్నిక వాయిదా వేయడంతో సంఘం సభ్యులు అసంతృప్తితో వెనుతిరిగి వెళ్లారు. గొర్రెల కాపరులసంఘం ఎన్నిక నిర్వహించినట్లయితే గొర్రెల కాపరులకు అనేక రకాల ఉపయోగాలు ఉంటాయని ఎన్నిక వాయిదా పడడం వల్ల ప్రభుత్వ పథకాలు కోల్పోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

తూతూమంత్రంగా మండల మీట్

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రజలకు సేవలు అందించడంలో మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో బాధ్యతగా విధులు నిర్వర్తించాలని బత్తలపల్లి ఎంపిపి బగ్గిరి త్రివేణి అన్నారు. శుక్రవారం బత్తలపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన వివిధ శాఖల అధికారులు తమకేమీ సంబంధంలేదన్నట్లు తమను ఎవరు ఏమీ చేయలేరనే ధీమాతో సమావేశానికి డుమ్మా కొట్టడం విచారకరమన్నారు.. సమావేశం ప్రారంభం కాగానే అజెండా ప్రకారం అధికారులను పిలిచి ఆయా శాఖల ప్రగతిని వివరించాలని ఎంపీడీవో నరసింహనాయుడు. పరిపాలన అధికారె మల్లికార్జున శాఖల వారీగా పేరు పెట్టి పిలవగా అందులో తహశీల్దార్, రోడ్లు, భవనాల శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, ఇరిగేషన్, ఉద్యానవన, సిరికల్చర్, పోలీస్ శాఖల అధికారులు హాజరు కాలేదు. ప్రభుత్వం నుంచి వేలాది రూపాయల వేతనాలు తీసుకుంటూ ప్రజలకు జవాబు దారేగా ఉండాల్సిన అదికారులు సమావేశానికి డుమ్మా కొట్టడంపై ఎంపిపి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా డుమ్మా కొట్టే అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు తీర్మాణం చేసి పంపినా ఎలాంటి చర్యలు లేకపోవడం వల్లనే ఇలా వ్యవహరిస్తున్నారని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము కూడా ఏమీ చేయలేమని, తమరే (ఎంపీపీ) జిల్లా కలెక్టర్‌కు విన్నవించాలని ఎంపీడీవో నరసింహనాయుడు అంటున్నారంటే తీవ్రత ఎంత. స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని సభ్యులు వ్యాఖ్యానించారు. మిగిలిన శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి, అమలు చేస్తున్న పథకాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు తమ పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను అదికారుల దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారం కాకపోగా తమను శత్రువులుగా చూస్తున్నారని ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కోటి సుధా, వైస్ ఎంపీపీ గజ్జల వెంగళరెడ్డి, ఎంపీటీసీలు తప్పెట అంజనేయులు, కోటి నరేష్‌కుమార్, మంజుల, సుజాత, నాగేంద్ర, సర్పంచులు చల్లా కరుణార్‌నాయుడు, మాదిరెడ్డి పద్మావతమ్మ, ప్రభాకరరెడ్డి, చిన్న ముసలప్పతో పాటు ఆయాశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కదిరి క్రీడాకారిణికి భారత జట్టులో చోటు

ప్రజాశక్తి - కదిరి టౌన్

గోల్ షాట్ బాల్ భారత క్రీడా జట్టులో కదిరి పట్టణం నిజాంవలి కాలనీకి చెందిన ఫరాన్ సబాఖానం చోటు దక్కించుకున్నట్లు గోల్ షాట్ బాల్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఎన్. రాజేంద్ర ప్రసాద్, ముఖ్య కార్యదర్శి ఎం. మనోహర్ రెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి ప్రసన్న కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫటాన్ నవీద్ ఖాన్, నస్రీన్ ఖానంల కుమార్తె సబాఖానం ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతోందన్నారు. గత 10 సంవత్సరాలుగా ఈ విద్యార్థి క్రీడల్లో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొని సత్తా చాటిందని తెలిపారు. నేపాల్ దేశంలోని ఖట్మండులో ఈనెల 15 నుండి 19వ తేదీ వరకు జరిగే గోల్ షాట్ బాల్ సౌత్ ఏషియన్ ఛాంపియన్ షిప్ క్రీడల్లో సబా పాల్గొంటున్నట్లు వివరించారు. కదిరికి చెందిన క్రీడాకారిణి సబా దేశం తరపున గోల్ షాట్ బాల్ క్రీడలో పాల్గొనడం గర్వకారణమని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారత జట్టు విజయం సాధించేలా సబా మంచి నైపుణ్యం ప్రదర్శించాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - రొళ్ల

మండల పరిధిలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన సద్వినియోగం చేసుకోవాలని చేసుకోవాలని ఆబ్యాంకు బ్రాంచి మేనేజర్ చేతన్ తెలిపారు .436 రూపాయలు ప్రీమియం చెల్లించి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. 18 నుండి 50 సంవత్సరాలు లోపల ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ ప్రీమియం ద్వారా కుటుంబం పోషించే వ్యక్తి అనుకొని విధంగా మరణించినప్పుడు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం ద్వారా రెండు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే విధంగా తక్కువ ప్రీమియంతో ఈ పథకాన్ని తీసుకువచ్చామన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కొత్తచెరువు

టిటిసి 2026 డ్రాయింగ్, హ్యాండ్ లుమ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, లోయర్ హయ్యర్ గ్రేడ్లకు జనవరి నెలలో ప్రభుత్వం గుర్తించిన కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో కిష్టప్ప, వృత్తి విద్యాధికారి లాజర్ తెలిపారు. ఏడవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు లోయర్ గ్రేడ్ పరీక్షకు హాజరు కావడానికి అర్హులని ఈ గ్రేడ్ కు సమానమైన ఉత్తీర్ణత సాధించిన వారు సంబంధిత హై గ్రేడ్ పరీక్షలకు హాజరుకావడానికి అర్హులని అన్నారు. అపరాధ రుసుము లేకుండా డిసెంబర్ 27వ తేదీవరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. డ్రాయింగ్ లోయర్కు రూ.100, డ్రాయింగ్ హైయర్ కు రూ.150, టైలరింగ్ లోయర్కు రూ. 150, హయ్యర్కు రూ.200, ప్రభుత్వ వెబ్సైట్లో ఫీజు చెల్లించాలన్నారు.

ప్రకాష్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - గుడిబండ

గుడిబండ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఉద్యోగోన్నతిపై అగలి మండలానికి బదిలీ పై వెళ్లిన రెడ్డి ప్రకాష్ను ఇతరులు ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని గుడిబండ మండలం డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు నాయక్ అధికారులకు సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం రెడ్డి ప్రకాష్ వీడ్కోల సభను ఘనంగా నిర్వహించారు. ఈ వీడ్కోల సభలో డిప్యూటీ ఎంపీడీవో ఎంపీడీవో నాగరాజు నాయక్ తో పాటు, సర్పంచులు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్డి ప్రకాష్ను వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బందితో పాటు ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేయాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే అమలు చేయాలని వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అమరనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలపై ఆర్ డి ఓ మహేష్ కి వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు రూ.7,800 కోట్లు వెంటనే విడుదల చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా వైయస్ఆర్ విద్యార్థి విభాగం తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ విద్యార్థి విభాగం నాయకులు ప్రవీణ్ రాయల్, చైతన్య రెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నర్సింగ్ విద్యా బోధన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల లో విద్యార్థినులకు ఉపయోగ కరంగా నర్సింగ్ విద్యా భోదన నిర్వహించడం జరుగుతోంది. ఈ మేరకు శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ ఎమ్. వనిత వాణి మాట్లాడుతూ విద్యార్థినులకు ఈ నర్సింగ్ కోర్స్ సౌకర్యం కల్పించడంతో , తమ కళాశాల లో 35 మంది శిక్షణ పొందుతున్నారన్నారు. అధ్యాపకులు శాంతి, చంద్ర కళ వీరికి శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు ఇందు ప్రియా, అజూమ్ కౌసర్, జాహ్నవి, లిఖిత తదితరులు మాట్లాడుతూ తమకు ఉపాధి కల్పిస్తూ పేదవారికి ఆరోగ్య సేవలు అందించే విధంగా ఈ శిక్షణ తోడ్పడుతుందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ప్రజాశక్తి - రొళ్ల

మండల పరిధిలోని దాసప్ప పాలెం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. దాదాపు 200 కుటుంబాలున్న ఈ గ్రామంలో ఉన్న బోరుబావి మరమ్మతుకు గురై నెలలు గడిచిపోయిన సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ కార్యదర్శి అందుబాటులో లేకపోవడం వల్ల సమస్య అధికమైందన్నారు. తాము రైతుల దయాదాక్షణ్యాల వల్ల వ్యవసాయ బోరు బావి లను ఆశ్రయించి నీరు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో నెలకొన్న త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు విన్నవించినా వారు పట్టించుకలేదని ఆరోపించారు.. ఇప్పటికైనా సంబధిత అధికారులు స్పంచింది తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యానిమేటర్లకు అవగాహన

అమరావురం : మండల కేంద్రంలోని డిఆర్డిఏ వెలుగు హేమా మండల సమాఖ్య కార్యాలయంలో విజన్ బిల్డింగ్ పైన ఎపిఎం ముత్యాలప్ప అధ్వర్యంలో, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాతమ్మ అధ్యక్షతన నిర్వహించిన నాలుగు రోజులు శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. మహిళా సంఘాల బలోపేతం, మార్పు విజన్ బిల్డింగ్ పై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాతమ్మ, ఎపిఎం ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా మారుద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు బాధ్యతతో, సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "మిషన్ వాత్సల్య పథకం"లో భాగంగా జిల్లాలో బాల్య వివాహ నిర్మూలనకు వంద రోజుల అవగాహన కార్యక్రమం నిర్వహణపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక కుటుంబానికే కాదు, సమాజానికే నష్టం కలిగించే సామాజిక అంశం అని అన్నారు. బాల్య వివాహాలు జరుగకుండా గ్రామం నుంచి వార్డు స్థాయిలోనే సకాలంలో నివారణ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బాలల భవిష్యత్తు ప్రమాదంలో పడకుండా పాఠశాలలు, ఐసిడిఎస్ కేంద్రాలు, పోలీస్ శాఖ, గ్రామ, వార్డు సచివాలయాలు పరస్పర సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాల నివారణలో గ్రామ, వార్డు మహిళా పోలీస్, ఆశా, అంగన్వాడిలు కీలక పాత్ర పోషించాలని, ప్రమాదంలో ఉన్న బాలికలను గుర్తించి వెంటనే మహిళా శిశు సంక్షేమ శాఖకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. బాల్య వివాహాలపై, మహిళల ట్రాఫికింగ్ పై కూడా అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో సమావేశాలు, ర్యాలీలు, మానవహక్కుల దినోత్సవాలు, మహిళా దినోత్సవాల్లో ప్రత్యేక ప్రచారం చేయాలని ఆదేశించారు. మిషన్ వాత్సల్య పథకంలో సూచించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని, ప్రతి కేసును జీరో టాలరెన్స్తో వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బాల్య వివాహాలు అరికట్టడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆంగన్వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళా సంఘాలు చురుకుగా పాల్గొనాల్సిన అవసరం ఉందని చెప్పారు. బాల్య వివాహాలు చేయడం నేరం అనే విషయాలను సంబంధిత పురోహితులకు, ఖాజీలకు , పాస్టర్లకు తెలియజేయాలని సూచించారు. ఫంక్షన్ హాల్ నందు కూడా ఇక్కడ బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అనే నినాదంతో పోస్టర్లు వేయించాలని, కేవలం వంద రోజులు మాత్రమే కాకుండా ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో చర్చించి తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాల్య వివాహరహిత ప్రచార క్యాంపెయిన్ బ్యానర్ పై జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అలాగే బాల్య వివాహ ముక్త భారత్ 100 రోజుల క్యాంపెయిన్ సెల్ఫీ పాయింట్ ను కూడా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సువర్ణ, డి.ఎస్.పి విజయకుమార్, చైల్డ్ ప్రొటెక్షన్ అడోలసెంట్ యూత్ డెవలప్మెంట్ అధికారి ఎం. మురళీకృష్ణ, ఐసిడిఎస్ పీడీ ప్రమీల రాణి, డిపిఒ సమత, డిఆర్డిఎ పీడీ నరసయ్య, బీసీ, సోషల్ వెల్ఫేర్ అధికారులు రాజేంద్రరెడ్డి, రెడ్డి బాలాజీ, డీఈవో కిష్టప్ప, డిసిహెచ్ఎస్ డాక్టర్ మధుసూదన్, జిఎస్డబ్ల్యూఎస్ అధికారి సుధాకర్ రెడ్డి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరికృష్ణ, డీసీపీవో మహేష్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిల్లా కేంద్రంపై కౌన్సిల్లో తీర్మానం చేయాలి

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురాన్ని జిల్లా కేంద్రం చేయాలని మున్సిపల్ కౌన్సిల్ లో ఏకగ్రీవ తీర్మానం చేయాలని జిల్లా సాధన కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాధన కమిటీ నాయకులు ఇందాద్, ఉమర్ ఫరూక్ ఖాన్ మాట్లాడుతూ హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలన్న ప్రజల దీర్ఘకాలిక డిమాండ్ను నెరవేర్చేందుకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు సహకరించాలన్నారు. హిందూపురం మున్సిపాలిటీ కౌన్సిలర్ల ఆమోదం కోసం అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. హిందూపురం భౌగోళిక పరిస్థితులు, అభివృద్ధి అవకాశాలు, ప్రజాసంఖ్య, ఆర్థికస్థితి, ప్రభుత్వ కార్యాలయాల అవసరం వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రజల సౌకర్యాలు, పట్టణ అభివృద్ధి, రవాణా సౌకర్యాలు, ప్రాంతీయ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకుని హిందూపురాన్ని జిల్లాకేంద్రంగా ప్రకటించాలని కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం జిల్లా సాధన కమిటీ ప్రతినిధులు బాబావలి, శ్రీరాములు, నూర్ మహమ్మద్, ఫరూఖ్ ఖాన్, శంకర్, రవికుమార్, నరసింహమూర్తి, ఇమ్రాన్, ఇంతియాజ్, న్యాయవాదులు ఉదయసింహ రెడ్డి, అతీక్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ట్రాలీ యూనియన్కు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ఎపి ట్రాలీ యూనియన్ను స్థలాన్ని కేటాయించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ సర్కిల్లో హైస్కూల్ గోడ ప్రక్కన ఉన్నటువంటి ఏపీ ట్రాలీ యూనియన్ స్థలాన్ని కొంతమంది రాజకీయ నాయకులు అండదండలతో బంకులు వేసుకొని స్టాండ్ లేకుండా చేశారన్నారు. 2004వ సంవత్సరంలో అప్పుడున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు ఇక్కడ స్టాండ్ పెట్టుకోమని సర్పంచితో సంప్రదించి స్టాండ్ ను ఏర్పాటు చేశారన్నారు. అప్పటినుంచి కార్మికులు వాహనాలు అక్కడే పెట్టుకుంటూ ఉండేవారన్నారు. అయితే ప్రస్తుతం ఆస్థలాన్ని కబ్జా చేశారని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆక్రమణలు తొలగించి ఎపి ట్రాలీ యూనియన్ కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒ, మేజర్ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండల వెంకటేష్, బాబ్జాన్, శ్రీరామ్ రెడ్డి, నరేష్, శ్రీహరి చిన్న వెంగముని,ఏపీ ట్రాలీ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

ధర్మవరం పట్టణ శాఖ నూతన కార్యవర్గం

గాండ్లపెంటలో మోడల్పేపర్లతో విద్యార్థులు, యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

యుటిఎఫ్ ధర్మవరం పట్టణ శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ధర్మవరం పట్టణంలోని స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్ రామకృష్ణ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి ఎన్నిక పరిశీలకులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు యూటీఎఫ్ పట్టణ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కెజివి. నాగిరెడ్డి, అధ్యక్షులుగా జింక హరికృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్గా కే, నాగేంద్రమ్మ, కె. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా హెచ్, రామాంజనేయులు,కోశాధికారిగా ఆంజనేయులు, ఆడిట్ కమిటీ కన్వీనర్ గా ఎం, ఆదిశేషు, కార్యదర్శులుగా పి, రామకృష్ణ, డి వి వెంకట సురేష్, ఎస్. కుళ్లాయప్ప, చంద్రశేఖర్, హనుమంతు, ప్రవల్లిక, జిల్లా కౌన్సిలర్లుగా జానకి, లక్ష్మయ్య, సాయి గణేష్, ఏం, రాంప్రసాద్ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ కన్వీనర్ బిల్లే రామాంజనేయులు, ఉపాధ్యాయులు షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట :ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల నూతన కమిటీని జిల్లా కోశాధికారి డి శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం ఎన్నికల అధికారి వైవి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమానికి ఎన్నికల పరిశీలకుడుగా జిల్లా కార్యదర్శి చెన్నూరి తహర్ అలీ హాజరై నూతన కమిటీని ఏకగ్రీవ ఎన్నుకున్నట్లు చెప్పారు. మండల గౌరవ అధ్యక్షులుగా ఎం రామసుబ్బయ్య, అధ్యక్షులుగా ఎస్ రమణ నాయక్, ఉపాధ్యక్షులుగా ఎంవీ రమణారెడ్డి, ఎం రూపకళ, ప్రధాన కార్యదర్శిగా జి ఖాదర్బాషా, కోశాధికారిగా జె నాగరాజు నాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా మల్లికార్జున, లక్ష్మిప్రసాద్, ఆడిట్ కమిటీ కన్వీనర్గా మహబూబ్ బాషా కార్యదర్శులుగా అనంతరం మండలంలోని కట్టూరుపల్లి, గొడ్డు వెలగల, తుమ్మల బైలు, కేజీబీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ తయారుచేసిన మోడల్ పేపర్ పుస్తకాలను దాత గొడ్డు వెలగల మాజీ సర్పంచ్ బి ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం మండల విద్యాశాఖ అధికారి గంగప్ప నేషనల్ కౌన్సిల్ ఫర్ పీస్, ఊటీ , తమిళనాడు సంస్థ నుండి డాక్టరేట్ అందుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఓరియంటల్ పాఠశాలలో ఎంఇఒను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఎంఈఓ గంగప్ప సేవలు కేవలం విద్యారంగానికే పరిమితం కాకుండా సాహిత్య, కళా రంగాలలో కూడా విస్తరించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాస్, రాష్ట్ర గౌరవ సలహాదారు పెన్నోబలం, హిందూపురం శాఖ అధ్యక్ష కార్యదర్శులు, మహమ్మద్ అన్సర్, గోవర్ధన్, ఉపాధ్యక్షులు బాలకృష్ణ, ఆర్థిక కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, బాలా నారాయణస్వామి రామాంజనేయులు, కేశవరెడ్డి, జనార్ధన్, శంకరయ్య, మహిళా ఉపాధ్యాయులు అనిత వాణి, సువర్చల, మాధవి, మంజుల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి లక్ష్యం ఉండాలి

ప్రజాశక్తి హిందూపురం

ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్య చేధన కోసం పట్టుదలతో శ్రమించాలని కేంద్ర విశ్వవిద్యాలయ డీన్ షీలా రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పూలకుంట సమీపంలో ఉన్న లోటస్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు నీలకంఠారెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర విశ్వవిద్యాలయం డీన్ షీలా రెడ్డి, కేశవరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప హాజరయ్యారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతంలో లోటస్ పాఠశాలలు స్థాపించి విద్యార్థులకు విద్యాదానం చేయడంపై నీలకంఠారెడ్డిని అతిథులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చ్రపతిభ కనబరిచిన వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సెక్రటరీ అనిల్ కుమార్తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : ఎమ్మెల్యే



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

రెవెన్యూ సమస్యలతో పాటు ఇతర భూ వివాదాలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆమె ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు టీడీపీ కార్యాలయానికి వచ్చి అర్జీలు ఇచ్చారు. ఇందులో ఎక్కువగా రోడ్లు, పంచాయతీరాజ్ విభాగం, రెవెన్యూ, పింఛన్లు వంటివి ఉన్నాయి. ఇందులో కొన్నింటికి అక్కడిక్కడే పరిష్కారం చూపారు. మరికొన్నింటికీ నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నాయకులు కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పార్టీకి సంబంధించిన కార్యక్రమాలతో పాటు, ప్రభుత్వ పథకాలపై ప్రచారం వంటి వాటి మీద చర్చించారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకుని రావాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలియజేసారు. అంతకు ముందు మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల, కస్తూరిబా బాలికల పాఠశాల సమీపంలో సీ.సీ రోడ్డును ప్రారంభించారు. 12 లక్షల రూపాయల మండల పరిషత్, పంచాయతీ నిధులతో ఈ రోడ్డును నిర్మించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నాలెడ్జ్ సెంటర్ను ఏర్పాటు చేయండి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవరణంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను నిర్మించాలని కోరుతూ అందరివాడు ఉత్సవ సొసైటీ అధ్వర్యంలో శుక్రవారం రోజు స్థానిక టీడీపీ కార్యాలయంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధ్వర్యంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ ముష్టి కోవెల గ్రామానికి చెందిన వెట్టి నరసింహ లు అధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. విగ్రహ ఆవరణంలో ఒక నాలెడ్జ్ సెంటర్, ఒక కమ్యూనిటీ భవనం, ఆవరణం చుట్టుప్రక్కల ప్రహరీ, అలాగే చెట్లను పెంచుకోవడానికి తాగునీటి బోర్ ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమములో అందరివాడు ఉత్సవ సొసైటీ కి చెందిన చెన్నేకొత్తపల్లి మండల సింగిల్ విండో అధ్యక్షుడు ముష్టికోవెల వెట్టి నరసింహులు,చెన్నేకొత్తపల్లి కి చెందిన రాచర్ల రామక్రిష్ణ, పి.శ్రీనివాసులు అలాగే దామాజిపల్లి గంగాధర, లు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: ప్రజలనుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి వెంటనే పరిష్కార మార్గం చూపాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్యే పల్లె రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, పుట్టపర్తి నియోజకవర్గం లో ఎక్కడ రెవిన్యూ తగాదాలు లేకుండా చూడాలని కోరారు.. ప్రజా గ్రీవెన్స్ కు వచ్చిన అర్జీలే రిపీట్ అవుతున్నాయని అలా కాకుండా తక్షణం పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ,పోలీస్ , పంచాయతీరాజ్, ఆర్ డబ్లూ ఎస్ ,ఉపాధి , డీఆర్డీ డీఏ వెలుగు ,ఐసీడీఎస్ , ఇతర శాఖల అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

ఓ.డి.చెరువు ఎస్బిఐలో నకిలీ బంగారు నగలు తాకట్టు పెట్టి రుణం పొందడానికి యత్నించిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. బ్యాంక్ మేనేజర్ యేసుదాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహమ్మదాబాద్ క్రాస్ వద్ద నిందితులు అందేజయప్ప, నరసింహులు, నగేష్, మంజునాథ, రఘు కుమార్ను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి టొయోటా ఫార్చునర్ కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అంతేకాకుండా వడ్డాణం లక్ష్మి డాలర్ లాంగ్ చైన్, బంగారు వడ్డాణాన్ని గ్రామస్తుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గోరంట్ల : పట్టణంలో స్టేట్ బ్యాంకులో ఈనెల 9న నకిలీ బంగారంతో రుణం పొందడానికి ప్రయత్నించిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. 11వ తేదీన మండలంలోని మిషన్ తాండ వద్ద ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితులు శంకర్, నంజుండప్ప, వడ్డే శంకర్ను శుక్రవారం కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రూరల్ పరిధిలో ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. మాలగుండ్ల పల్లి గ్రామ సమీపంలో గల గుట్టవద్ద పేకాట స్థావరం పై దాడి చేసి 13 మంది పేకాట రాయళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.38,400 నగదు, 12 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ ఐ శ్రీనివాసులు తెలిపారు.

మేకలు చోరీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని దొరిగల్లు గ్రామంలో శుక్రవారం రాత్రి ఇందుకూరు నారాయణ కు చెందిన 66 మేకలను దొంగలు ఎత్తుకెళ్లారు... వాటి విలువ దాదాపు 50వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామాన్ని సందర్శించి చోరీపై ఆరా తీశారు. అక్కడున్న సీసీ కెమెరాలను పరిశీలించారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి - తనకల్లు

మండలంలోని ఎనుగుగుండ తండాకు చెందిన మహిళ కొర్ర రేణుక ఈనెల 3న ఆదృశ్యమైనట్లు ఆమె భర్త బాబు నాయక్ ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు సమీప గ్రామాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవటంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

హాస్టల్లోకి వచ్చారంటూ ఫిర్యాదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం బీసీ సంక్షేమ శాఖ హాస్టల్లోకి అక్రమంగా చొరబడ్డారని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, పి బాలాజీ ఇచ్చిన పిర్యాదు మే